హమాలీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు నరసింహులు, సిహెచ్ సాయిబాబ

హమాలీ కుటుంబానికి సిఐటియు పరామర్శ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

గుండెపోటుతో మృతిచెందిన బిర్లగడ్డ హమాలి ఎం.మౌలాలి కుటుంబాన్ని సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు, కార్యదర్శి సిహెచ్.సాయిబాబా మంగళవారం పరామర్శించారు. గుండెపోటుతో మరణించిన ఎం.మౌలాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలోని 25వ వార్డు బిర్లాగడ్డ నివాసి అయిన ఎం.మౌలాలి బిర్లగడ్డ హమాలి యూనియన్ నాయకుడిగా గత30 సంవత్సరాలుగా పనిచేస్తూ, హమాలీ పనిచేసుకొని తనకుటుంబాన్ని పోషించుకుంటూ, సిఐటియు పోరాటాల్లో చురుకుగా పాల్గొంటూ, బిర్లాగడ్డ కాలనీలో సమస్యల పైన నిరంతరం పోరాటం చేసేవాడన్నారు. ఎం.మౌలాలి అకస్మాత్తుగా గుండెనొప్పి వచ్చి కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరణించారన్నారు. మౌలాలికి భార్య, ఇద్దరు మగ పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, ఆయన మరణం ఆ కుటుంబానికి, సిఐటియు సంఘానికి తీరనిలోటు అని అన్నారు. ఎం.మౌలాలి మరణవార్త విన్నవెంటనే బిర్లాగడ్డలోని వారి కుటుంబాన్ని సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు, సిఐటియు నగర కార్యదర్శి సి.హెచ్ సాయిబాబా, ఎ.రవి, హమాలీ కార్మికులు మౌలాలి భార్య, పిల్లలను కలిసి పరామర్శించారు. వారికి ధైర్యాన్ని నింపి సానుభూతి తెలిపారు. సిఐటియు సంఘం మీకు ఎల్లవేళలా అండదండగా ఉంటుందని అన్నారు. వారు మాట్లాడుతూ హమాలీ కార్మికులకు వెల్ఫేర్బోర్డును ఏర్పాటు చేసి ప్రమాద బీమా రూ. 10లక్షలు ఇవ్వాలన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్, పెన్షన్స్ సౌకర్యం కల్పించాలని, గుండెపోటుతో మరణించిన ఎం.మౌలాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బిర్లాగడ్డ హమాలి యూనియన్ నాయకులు సురేష్, మధు, బాష, నాగన్న, సూర్యరాజు, నాగరాజు, చిన్న మౌలాలి, జగదీష్ పాల్గొన్నారు.

కరువు నష్టం తేల్చేరా..?

- నేటి నుంచి జిల్లాలో కరువు బృందం పర్యటన - నష్ట పరిహారం మీద రైతుల ఆశలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కరువు విలయతాండవం చేస్తోంది. ఉపాధి లేక ఊళ్లకు ఊళ్లు వలస బాట పడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 30 మండలాల్లోనే కరువు పరిస్థితులు నెలకొన్నాయని ప్రభుత్వం ప్రకటించింది. 3,09,533 హెక్టార్లలో వ్యవసాయ పంటలకు నష్టం జరిగిందని వ్యవసాయాధికారులు నిర్ధారించారు. 3.71 లక్షల మంది రైతులకు రూ.280.58 కోట్ల పంటనష్ట పరిహారం ఇవ్వాలని నివేదిక రూపొందించారు. అన్నదాతలు కరువు కోరల్లో చిక్కి విలవిలలాడుతున్నారు. తమ మండలాలను కరువు జాబితాలో చేర్చాలని పోరాటం చేస్తున్నారు. బుధవారం నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలో కరువు బృందం పర్యటించనుంది. కరువు నష్టాన్ని తేల్చి న్యాయం చేస్తారని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు...

హోళగుంద మండలంలో గొర్రెలకు వదిలేసిన పంట (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో 30 మండలాల్లోనే కరువు పరిస్థితులు నెలకొన్నాయని ప్రభుత్వం ప్రకటించింది. 3,09,533 హెక్టార్లలో వ్యవసాయ పంటలకు నష్టం జరిగిందని వ్యవసాయాధికారులు నిర్ధారించారు. కర్నూలు జిల్లాలో 26 మండలాలుండగా అందులో కర్నూలు గ్రామీణం, తుగ్గలి మండలాలు మినహా మిగిలిన 24 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. ఆయా మండలాల్లో వేరుశనగ 2773 రైతులు 3 వేల హెక్టార్లలో, మొక్కజొన్న 4300 రైతులు 5050 హెక్టార్లలో, కందులు 773 మంది రైతులు 473 హెక్టార్లలో, జొన్న 22777 మంది రైతులు 22,014 హెక్టార్లలో, మినుములు 5864 మంది రైతులు 4891 హెక్టార్లలో, వరి 1512 మంది రైతులు 1155 హెక్టార్లలో, కొర్ర 1225 మంది రైతులు 1210 హెక్టార్లలో, పప్పుసెనగ 71055 మంది రైతులు 73871 హెక్టార్లలో నష్టపోయినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి. నంద్యాల జిల్లాలో 29 మండలాలుండగా అందులో మిడుతూరు పగిడ్యాల, బేతంచెర్ల, గడివేముల, బనగానపల్లి, పాణ్యం కలిపి ఆరు మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించింది. కరువుకు సంబంధించి 13 మండలాల్లో 36,389 హెక్టార్లలో పప్పు సెనగలు, 4,116 హెక్టార్లలో మినుములు, 2,076 హెక్టార్లలో పొగాకు, 12,908 హెక్టార్లలో జొన్న పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. కరువు నష్టం వాటిల్లిన ఆరు నెలలకు కరువు బృందం పర్యటించడంపై రైతులు, రైతు సంఘాల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

ఉద్యాన పంటలు 50 శాతం నష్టపోవాలట

50 శాతం నష్టపోతేనే ఉద్యాన పంటలను పరిగణనలోకి తీసుకున్నారు. కర్నూలు జిల్లాలో ఉద్యాన పంటల సాధారణ సాగు 50,312.24 హెక్టార్లు కాగా 87,775.13 హెక్టార్లలో సాగయ్యాయి. 59,139.6 హెక్టార్లలో మిరప సాగవ్వగా 30,086 హెక్టార్లలో 50 శాతం కంటే ఎక్కువ పంట నష్టపోయిందని అధికారులు తేల్చారు. 16,498.8 హెక్టార్లలో ఉల్లి సాగవ్వగా 8,842 హెక్టార్లలో 50 శాతం కంటే ఎక్కువ పంట నష్టపోయిందని ప్రతిపాదనలు రూపొందించారు. నంద్యాల జిల్లాలోని ఆరు కరువు మండలాల్లో ఒక్క హెక్టారులో కూడా ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లలేదని ఆ శాఖ అధికారులు తేల్చారు.

ఎకరాకు రూ.10వేల పరిహారం ఇవ్వాలి

ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.6300 నామమాత్రపు నష్టపరిహారం అందించారు. అది కూడా అందరికీ ఇవ్వలేదు. రబీలోనూ పంట మొత్తం తీవ్రంగా నష్టపోయింది. రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. నష్టపరిహారం వస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇప్పుడైనా రైతులందరికీ ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం చెల్లించాలి.

- జి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

కరువు బృందం పర్యటన ఇలా..

కేంద్ర కరువు బృందం బుధవారం నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించనుంది. బుధవారం కర్నూలు జిల్లాలోని ఆలూరు, కోడుమూరు మండలాల్లో పర్యటించనున్నారు. రైతులతో ముఖాముఖిగా మాట్లాడనున్నారు. అనంతరం కర్నూలు కలెక్టరేట్‌కు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించనున్నారు. గురువారం నంద్యాల జిల్లాలో పర్యటించనున్నారు. పాణ్యం, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ మండలాల్లో పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటించనున్న నేపథ్యంలో పంట నష్టాన్ని కళ్లారా చూసి కరువు నష్టాన్ని తేలుస్తారా అని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

మండలాల వారీగా పంట నష్టం నమోదు ఇలా...

మండలం	రైతులు	నష్టం ఎకరాల్లో
ఆదోని	21,933	46,242,67
ఆలూరు	7,353	17,735.57
ఆస్పరి	16,570	41,533.75
సి.బెళగల్	13,043	20,122
చిప్పగిరి	2,643	6,966.15
దేవనకొండ	23,581	56,568.55
గోనెగండ్ల	15,374	28,769.87
గూడూరు	8,855	16,220
హాలహర్వి	4,163	10,229.22
హోళగుంద	8,819	21,643.45
కల్లూరు	11,515	20,930.7
కోడుమూరు	13,901	23,980.1
కోసిగి	12,230	23,743.5
కౌతాళం	17,882	40,618.07
క్రిష్ణగిరి	19,697	39,717.95
కర్నూలు అర్బన్	281	382.52
మద్దికెర	6,826	14,438.95
మంత్రాలయం	9,239	18,000.95
నందవరం	14,726	31,493.15
ఓర్వకల్లు	8,185	15,257.15
పత్తికొండ	12,919	27,744.6
పెద్దకడబూరు	9,962	16,562.22
వెల్దుర్తి	16,665	29,175
ఎమ్మిగనూరు	14,379	27,502.32

ఆదర్శనీయుడు మోటూరు హనుమంతరావు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కమ్యూనిస్టు యోధుడు, ప్రజాశక్తి మాజీ సంపాదకులు మోటూరిహనుమంతరావు సమాజానికి ఆదర్శనీయుడని ప్రజాశక్తి ఎడిషన్ ఇన్‌చార్జి పానుగంటి చంద్రయ్య అన్నారు. మంగళవారం కర్నూలు ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో మోటూరు హనుమంతరావు 23వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రజాశక్తి సిబ్బంది నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ఎడిషన్ కమిటీ సభ్యులు జయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ... మోటూరు హనుమంతరావు తన నిత్యజీవితంలో ఎన్నో పోరాటాలను నిర్బంధాలను ఎదుర్కొన్నారు. ప్రధానంగా సంపాదకీయ రంగంలో సాధారణ పాత్రికేయునుగా మొదలుకొని విశాలాంధ్ర, జనశక్తి, ప్రజాశక్తి పత్రికలలో సంపాదకులుగా పనిచేశారు. ప్రజా సమస్యలను అక్షర రూపం దాల్చి, ఆయుధాలుగా పాలకుల ప్రభుత్వాలపై ఎక్కుపెట్టార న్నారు. విద్యార్థి దశ నుంచే అనేక పోరాటాలను నిర్వహిస్తూ వచ్చారన్నారు. తన బాల్యం నుంచే జాతీయవాదిగా హరిజన సహపంక్తి భోజనాలు, కల్లుకుండలను పగులుగొట్టే పోరాటాల్లో పాలుపంచుకున్నారన్నారు. అనేక పోరాటాల్లో జైలు జీవితాన్ని గడిపారన్నారు. నిర్బంధాలను ఏమాత్రం లెక్కచేయకుండా పత్రిక పురోగతికి కషి చేశారన్నారు. విశాలాంధ్ర జనశక్తి ప్రజాశక్తి వార దిన పత్రికలకు తాను సంపాదకులుగా ప్రత్యక్షంగాను పరోక్షంగానూ వ్యవహరించారన్నారు. కేవలం సంపాదకులుగానే కాకుండా ఆయన రాజకీయంగాను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, రాజ్యసభ సభ్యులుగాను తన రాజకీయ చతురతను ప్రదర్శించారన్నారు. చట్టసభల్లో ప్రజల గొంతుకగా ఆయన నిలబడ్డారన్నారు. ఆయన సేవలకు గుర్తుగా ప్రజాశక్తి ఆధ్వర్యంలో ప్రతిభ అవార్డులను ఉత్తమ జర్నలిస్టులకు ప్రతి సంవత్సరం అందజేస్తున్నామన్నారు. వృత్తిలో అంకితభావంతో పనిచేయడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. ఎడిషన్ కమిటీ సభ్యులు ఎం.రాజు, వినయ్ కుమార్, ఎల్లాగువేర, మంగయ్య ప్రజాశక్తి సిబ్బంది, విలేకరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న పి.చంద్రయ్య, జయలక్ష్మి ,రాజు, ఎల్లాగౌడ్, వినయ్‌కుమార్,

పేదల ఇంటి ముంగిట నాణ్యమైన వైద్యం

- డిఎంహెచ్‌ఒ ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

104 సంచార వాహనం ద్వారా పల్లెలో ప్రజల ముంగిటకే నాణ్యమైన వైద్యం అందుతున్నట్లు డిఎంహెచ్‌ఒ వైఎన్.ప్రవీణ్ కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఢణాపురం గ్రామంలో 104 అంబులెన్స్ వైద్య సేవలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎలాంటి ఖర్చు లేకుండా సొంత ఊళ్లోనే నాణ్యమైన వైద్యం అందించడం కోసమే 104 ఫ్యామిలీ డాక్టర్ ఫిజిషియన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా ఈ వాహనంలో వైద్య సిబ్బంది వచ్చి చిన్న, చిన్న జబ్బులకు చికిత్సలు చేసి, మందులను అందిస్తారని పేర్కొన్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు సైతం నెలకు సరిపడా మందులను రోగులకు అందిస్తున్నట్లు తెలిపారు. వైద్యులు ఇబ్రహీం, ఎంపిహెచ్ఒ ఉమాపతి, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

104 సంచార వాహనాన్ని తనిఖీ చేస్తున్న డిఎంహెచ్‌ఒ ప్రవీణ్‌కుమార్

చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి - హోళగుంద

'స్టాప్ డయేరియా' కార్యక్రమంలో భాగంగా ఐదేళ్లలోపు చిన్నారులు గల గృహాలను సందర్శించి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. మంగళవారం హోళగుంద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నెరణికి తండాలో జరుగుతున్న ఇంటింటి సర్వే, వైద్య శిబిరాన్ని డిఎంహెచ్ఒ డాక్టర్ ప్రవీణ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సరిపడా మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకొని వైద్య శిబిరాన్ని 7 రోజులపాటు కొనసాగించి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కాచిచల్లార్చి, వడబోసిన నీటిని తాగాలని, చేతుల శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. డాక్టర్ న్యూటన్, డిస్ట్రిక్ట్ ఎపిడమాలజిస్ట్ వేణుగోపాల్, ఎంపిహెచ్ఇఒ చలపతి, సూపర్ వైజర్ మోక్షేశ్వర్ పాల్గొన్నారు. అనంతరం ఆదోని ఏరియా ఆస్పత్రిలో అసంక్రమిత వ్యాధుల నివారణలో భాగంగా నిర్వహిస్తున్న కేన్సర్ స్క్రీనింగ్‌పై మూడురోజుల శిక్షణ కార్యక్రమాన్ని డిఎంహెచ్ఒ సందర్శించారు. ఎఫ్‌డిపి నోడల్ ఆఫీసర్ డాక్టర్ బాలమురళీ, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు పాల్గొన్నారు.

హోళగుందలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ

ఇంటర్ సప్లిమెంటరీలో 20వ స్థానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర సప్లిమెంటరి పరీక్షఫలితాలు మంగళవారం నాడు విడుదల అయ్యాయి. ఈ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో కర్నూలు జిల్లా 20వ స్థానంలో నిలిచింది. ఈ సప్లిమెంటరీ పరీక్షకు జనరల్ విద్యార్థులు 6008 మంది విద్యార్థులు హాజరుకాగా 3114 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 52శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది. వొకేషనల్ కోర్సులకు 712 మంది విద్యార్థులు రాయగా 319 ఉత్తీర్ణులయ్యారు. 45శాతం ఉత్తీర్ణతశాతం నమోదు అయ్యింది. వోకేషనల్ కోర్సులకు సంబంధించి 25వ స్థానంలో కర్నూలు జిల్లా నిలిచింది.

ఆరోగ్యం కోసం యోగ సాధన అవసరం

రాష్ట్ర యోగ సంఘం చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆధునిక జీవితంలో ఆరోగ్యం కోసం ప్రతిరోజు విద్యార్థులు యోగసాధన చేయాలని రాష్ట్ర యోగ సంఘం చైర్మన్ , 26వ వార్డు కార్పొరేటర్ దండు లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం పదవ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా కర్నూలు అవుట్డోర్ స్టేడియంలో జిల్లా యోగా సంఘం, క్రీడాభారతి కర్నూలు జిల్లా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయియోగా పోటీలను నిర్వహించారు. లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాయోగ సంఘం ఆధ్వర్యంలో నిర్విరామంగా యోగా క్రీడాకారుల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. జిల్లా నుంచి ఇప్పటికే పదిమంది అంతర్జాతీయ స్థాయికి, వందమందికిపైగా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని జిల్లా కీర్తిని ఇనుమడింప చేశారన్నారు. ఈ కార్యక్రమంలో యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి, జిల్లా యోగ సంఘం ప్రతినిధులు అశోక్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శశిధర్, సురేష్, పోటీల నిర్వాహక కార్యదర్శి మునిస్వామి, శ్రీనివాసులు, జాతీయ యోగన్యాయ నిర్ణీత షహనాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షకార్యదర్శులుగా బి.తిక్కప్ప, ఎన్.జి.కృష్ణను

కెజిబిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా తిక్కప్ప, ఎన్‌జి.కృష్ణ

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కాటికాపరి గుంతలుతీసే బేగరుల సంఘం నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బి.తిక్కప్ప, ఎన్.జి.కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎండి.ఆనంద్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులుగా వీరేష్, యువరాజు, నాగశేషులు, రాజరమేష్, జిల్లా సహాయ కార్యదర్శులుగా ఫిలిప్, సురేష్, ఈశ్వరయ్య, తాయన్న, నరసింహులుతో పాటు మరో పది మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఓర్వకల్లు స్టేషన్‌నుతనిఖీ చేసిన ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఓర్వకల్లు పోలీసు స్టేషన్‌ను కర్నూలు జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. గ్రామాలలో పోలీసులు పర్యటిస్తూ ఉండాలని, అక్కడి పరిస్థితుల గురించి , సమస్యల గురించి ఎప్పటికప్పుడు ఆరా తీసి తెలుసుకోవాలన్నారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎలాంటి గొడవలకు, సంఘటనలకు అస్కారం లేకుండా గ్రామాలలో ప్రశాంతవాతావరణం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలపట్ల బాధితులు పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించినప్పుడు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. ఎన్నికల విధులలో ఎక్కడ కూడా ఎలాంటి సంఘటనలు జరగకండా పోలీసులు బాగా పనిచేశారని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఓర్వకల్లు ఎస్ఐ రాజారెడ్డి ఉన్నారు.

ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌లో ఫైళ్లను పరిశీలిస్తున్న ఎస్‌పి జి.కృష్ణకాంత్

స్కూలు బస్సును తనిఖీ చేస్తున్న ఆర్‌టిఒ

120 స్కూల్ బస్సుల తనిఖీ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలులోని అన్ని ప్రాంతాల్లో 120 స్కూల్ బస్సులను తనిఖీ చేశామని కర్నూలు జిల్లా ఆర్‌టిఒ రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కర్నూలులోని అన్ని ప్రాంతాలలో స్కూల్ బస్సులలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించమన్నారు. 120 బస్సులను తనిఖీ చేశారని తెలిపారు. తనిఖీ చేసిన అన్ని బస్సులూ ఫిట్నెస్ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయన్నారు. ఎలాంటి కేసులు నమోదు చేయలేదన్నారు. భవిష్యత్తులో ఇంకా అన్నీ తనిఖీ చేస్తామని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించేలా బస్సులు ఉన్నా కేసు నమోదు చేసి బస్సులను సీజ్ చేస్తామన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రయివేటు బస్సు యజమానులు జాగ్రత్తలు పాటించాలన్నారు.ఎంవిఐ మనోహర్‌రెడ్డి, ఎఎంవిఐ బాబుకిషోర్, మల్లికార్జున్, సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగుల జీవితాల్లో సిఎం వెలుగు నింపారు

ప్రజాశక్తి-క్రిష్ణగిరి : రాష్ట్రంలోని వికలాంగుల పెన్షన్ రూ.3000 నుంచి రూ.6000 తీవ్ర వైకల్యం కలిగిన వికలాంగుల రూ.10వేలు , రూ.15 వేలకు పెంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును, వికలాంగుల జీవితాలలో వెలుగులు నింపారని ప్రగతి మండల వికలాంగుల సమాఖ్య అధ్యక్షుడు రాజేంద్ర, ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య విహెచ్‌పిఎస్ నాయకులు గిడ్డయ్య గౌడ్, జిల్లా వికలాంగుల సమాఖ్యల జెఎసి కార్యదర్శి శివశంకర్ కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, పత్తికొండ ఎమ్మెల్యే కెఇ. శ్యాం కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వ హయంలో వికలాంగుల సంక్షేమం మరుగున పడిందన్నారు. 2016 వికలాంగుల హక్కుల చట్టం ఊసే లేకుండా చేశారన్నారు. గత ముఖ్య మంత్రి దివ్యాంగులనే పదం పలకడానికి కూడా ఇష్ట పడలేదనీ, అందుకే ఈ ఎన్నికల్లో వికలాంగులంతా గంపగుత్తగా తెలుగుదేశం కూటమికి ఓట్లేసి గెలుపునకు దోహదపడ్డారని తెలిపారు. కొత్త ప్రభుత్వం వికలాంగుల సంక్షేమానికి, 2016 దివ్యాంగుల చట్టం అమలుకు ప్రాధాన్యతనివ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రగతి మండల వికలాంగుల సమాఖ్య కార్యవర్గ సభ్యులు హనుమంతు, మహేశ్వరి, ధనంజయ, వీరేషమ్మ, అనూష, బీరప్ప, మద్దయ్య పాల్గొన్నారు

చంద్రబాబు, కెఇ.శ్యాంబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న వికలాంగులు

ఎమ్మెల్యే గౌరుచరితను కలిసిన జయరాజ్ ఇస్పాత్ స్టీల్ కంపెని సిఇఒ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితను మంగళవారం జయరాజ్ ఇస్పాత్ స్టీల్‌కంపెనీ సిఇఒ సురేశ్‌కుమార్ కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరుచరిత జయరాజ్ ఇస్పాత్ స్టీల్ కంపెనీ నిర్మాణపు పనులపై సిఇఒను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించాలని ఆమె కోరారు.

దస్తగిరిస్వామి దర్గాకు రూ.లక్షల విరాళం

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండల పరిధిలోనే ఎద్దులదొడ్డి గ్రామంలో దస్తగిరి స్వామి దర్గాకు టిడిపి నాయకుడు పెడసాని రామానాయుడు మంగళవారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకుడు పెడసాని రామానాయుడు మాట్లాడుతూ దస్తగిరి స్వామి దర్గా ఎద్దుల దొడ్డి గ్రామానికి ఎంతో పవిత్రమైనదని అన్నారు. దర్గా వద్ద నబి సాహెబ్ స్థలం ఉండడంతో ఆ స్థలాన్ని నబి సాహెబ్ దర్గాకు అప్పగించడంతో ఆయనకు రూ.లక్ష తాను సొంత డబ్బులు ఇచ్చానన్నారు. గ్రామస్తుల సహకారంతో దర్గాకు కాంపౌండ్ నిర్మాణ పనులు కూడా పూర్తి చేశామని తెలిపారు. పెడసాని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నగదును ఇస్తున్న రామనాయుడు

20న రెవెన్యూ దినోత్సవం

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఈనెల 20న రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించాలని రెవిన్యూ ఉద్యోగ సంఘం నేతలు జాయింట్ కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం జాయింట్ కలెక్టర్ మౌర్యాను రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా నేతలు కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం గత మార్చి నెలలో ఈనెల 20న రెవిన్యూ డే నిర్వహణకు సంబంధించి ఉత్తర్వులు కూడా ఇచ్చిందన్నారు. జాయింట్ కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు గిరికుమార్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి వెంకటరాజు, కోశాధికారి వేణుగోపాల్ రావు, లోకేశ్వర్ రెడ్డి, సుధాకర్, కృష్ణుడు, ప్రకాష్‌బాబు, సందీప్ నాయక్, సునీల్ కుమార్, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

నిరుపయోగంగా ఉన్న దహన సంస్కారాల సామగ్రిని పరిశీలిస్తున్న ఆనంద్‌బాబు

శ్మశాన వాటికను ఆధునీకరించాలి

- కెజిబిఎస్ రాష్ట్ర కన్వీనర్ ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని శ్మశాన వాటికను ఆధునీకరించాలని కాటికాపరి గుంతలుతీసే బేగరుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎమ్‌డి.ఆనంద్‌బాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిక్కప్ప, ఎన్‌జి.కృష్ణ, ఉపాధ్యక్షులు యువరాజు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని తిక్కస్వామి దర్గా వెనుక ఉన్న హిందూ శ్మశాన వాటికను పరిశీలించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా పట్టణంలో అనేక రకాల సమస్యలు పేరుకు పోయాయని తెలిపారు. బతికున్నప్పుడు భరించే సమస్యలు ఒకటైతే, చనిపోయాక పూడ్చే శ్మశానం లో సైతం సమస్యలు తప్పడం లేదన్నారు. జిల్లాలో మొదటి మున్సిపాలిటీగా ఉన్న ఆదోని అభివృద్ధికి నోచుకోక సమస్యలకు నిలయంగా మారిందన్నారు. శ్మశానంలో నూతన దహన వాటిక నిర్మాణం కోసం వచ్చిన రూ.1.30 కోట్ల నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. గ్యాస్‌తో దహనం చేసే నూతన దహన వాటిక నిర్మాణ పనులు బేస్ మట్టం లెవెల్‌లోనే ఆగిపోడమేమిటని నిలదీశారు. రూ.లక్షలు పెట్టి తెచ్చిన బర్నింగ్ మిషన్, బాయిలర్లు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బయట తుప్పు పట్టి పోతున్నాయని తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి దహన వాటిక నిధులు రూ.కోటిని కొల్లగొట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్మశాన వాటిక చుట్టూ గట్టి ప్రహరీ నిర్మించాలని కోరారు. శ్మశాన వాటికలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా రక్షణ కల్పించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కెజిబిఎస్ నాయకులు వీరేష్, తాయన్న, మారయ్య, మునిస్వామి, నాగశేషులు, మద్దిలేటి, శ్రీరాములు, ఉరుకుంద పాల్గొన్నారు.

20న పంచాయతీ మార్కెట్‌ల వేలం పాటలు

ప్రజాశక్తి - ఆలూరు

ఈనెల 20న ఆలూరు పంచాయతీలోని వారపు సంత, దినసరి మార్కెట్‌లు, బస్టాండ్, గొర్రెల మాంసం, వధశాల, పశువుల మాంసం, వధశాలకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఇఒఆర్‌డి ప్రకాష్ నాయుడు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆలూరు పంచాయతీ అభివృద్ధి కోసం ప్రతేడాదిలాగే ఈఏడాది వివిధ మార్కెట్‌ల వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జులై 1 నుంచి మార్చి 31, 2025 అర్ధరాత్రి వరకు రుసుం వసూలు చేసుకోవడానికి పంచాయతీ ఆవరణలో సంబంధిత అధికారుల సమక్షంలో వేల పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు గెజిట్ నోటిఫికేషన్ షరతులకు లోబడి ఉండాలని అన్నారు. వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యే బీవీని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - నందవరం

ఎమ్మెల్యేగా గెలుపొంది మొట్ట మొదటిసారిగా వ్యవసాయ మార్కెట్ యార్డుకు వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డిని టిడిపి నాయకులు కలిశారు. మంగళవారం టిడిపి మండల నాయకులు మాధవ రావు దేశాయ్, ఈరన్న గౌడ్, గోపాల్, నారాయణ రెడ్డిలు ఎమ్మెల్యే బీవీకి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎమ్మెల్యే బీవీ గెలుపు కోసం మండలంలో ప్రతి నాయకుడూ, కార్యకర్త కూడా నిరంతరం కృషి చేశారని తెలిపారు. బీవీకి మెజారిటీ వచ్చిందని, అదే మెజారిటీని ప్రతి ఎన్నికల్లో నిలబెట్టుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యేగా గెలిచినందుకు మండలానికి రావాలని బీవీని కోరామని, త్వరలోనే మండలంలో పర్యటిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే మార్కెట్ యార్డులో రైతులకు అన్ని సౌకర్యాలూ కల్పించాలని ఎమ్మెల్యేను కోరినట్లు చెప్పారు.

శ్రీమఠంలో ఎమ్మెల్యే బీవీ పూజలు

మంత్రాలయం : ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న ఆయనకు శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, సహాయకులు బింధు మాధవాచార్ స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళహారతులు స్వీకరించారు.

పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

పడకేసిన పారిశుధ్యం...

- వైద్యాధికారి కార్యాలయం ముందే మురుగునీరు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. ఎక్కడపడితే అక్కడ మురుగునీరు నిలవడం వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమకాటు బారినపడ్డ వారికి డెంగీ, మలేరియా వ్యాధులు సోకుతాయి. ఇప్పటికే ఒళ్లు నొప్పులు, తలనొప్పి, జ్వరం, జలుబు, దగ్గు అంటూ ఆదోని ప్రభుత్వాస్పత్రికి వచ్చే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. దోమల నివారణకు చర్యలు చేసుకుంటున్నామని అధికారులు చెబుతున్నా కనీసం ఫాగింగ్ చర్యలు కూడా చేపట్టడం లేదని పలువురు చెబుతున్నారు. రోడ్ సైడ్ ఇళ్ల మధ్యలో ఎక్కువ రోజులు నీరు నిలుస్తూనే ఉంది. నిలిచిన నీటిని పారిశుధ్య కార్మికులు కనీసం బయటకు పోయేలా ఏర్పాటు కూడా చేయడం లేదని చెబుతున్నారు.

బాధ్యతారహితంగా శానిటేషన్

ఆదోని పట్టణంలో పారిశుధ్య కార్మికులు తమ విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల కొందరు నామమాత్రంగా విధులకు హాజరై సమయం ముగియగానే ఇళ్లకు వెళ్తున్నట్లు కూడా విమర్శలు ఉన్నాయి. వారికి కేటాయించిన ప్రాంతంలో మాత్రమే వీధులను శుభ్రం చేసి వెళ్తున్నారని, రోడ్డు సైడ్ గుంతల్లో నిలిచిన నీటిని బయటకు పోయేలా చర్యలు చేపట్టడం లేదని పేర్కొంటున్నారు. ఎక్కువ కాలం నిలిచిన నీటిలో బ్లీచింగ్, కిరోసిన్ ఆయిల్ బాల్స్ పిచికారి చేయాల్సి ఉంది. కాలువల వెంట ఫాగింగ్ చేసి దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు చేపట్టడం లేదని పురవాసులు చెబుతున్నారు.

వైద్యాధికారి కార్యాలయ ముందే మురుగునీరు

ఆదోని పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో డిప్యూటీ వైద్యాధికారి కార్యాలయం ఉంది. ఆ కార్యాలయం ముందే ఎక్కువ రోజుల నుంచి మురుగునీరు నిలిచి ఉంది. ఆ నీటిలో దోమలు వ్యాప్తి చెంది ఉన్నాయి. కార్యాలయంలోపలకు వెళ్లాలంటే ఆ మురుగునీరు పాదాలకు అంటించుకొనే వెళ్లాల్సి ఉంటుంది. కనీసం నీరు పారే విధంగా కూడా ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడం ఏమిటని పలువురు నిలదీస్తున్నారు. దోమలు వృద్ధి చెందరాదని, వాటివల్ల సీజనల్ వ్యాధులు వస్తున్నాయని వైద్య సిబ్బంది నిత్యం ప్రచారం చేస్తోంది. ఆ సిబ్బంది ఉంటున్న కార్యాలయం ముందే ఇలా అపరిశుభ్రత నెలకొనడం నిర్లక్ష్యానికి నిదర్శనం అంటూ చెబుతున్నారు. ఇప్పటికైనా ఎక్కువకాలం నిలిచిన నీటిని శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

కార్యాలయం ఆవరణలో నిలిచిన మురుగునీరు

పట్టణంలో నిలిచిన మురుగునీరు

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

- నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి- దేవనకొండ

గత కొన్ని రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. దేవనకొండ పోలీసు స్టేషన్ పరిధిలో పని చేస్తున్న హోంగార్డు శ్రీనివాసులు మృతి చెందారు. మంగళవారం స్థానిక సిఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది, మహిళ సంరక్షణ కార్యదర్శులు మృతుని కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సిఐ మాట్లాడుతూ... విధి నిర్వహణలో మంచి పేరు తెచ్చుకున్న శ్రీనివాసులు ఆకస్మిక మృతి ఆ కుటుంబాన్ని కలవర పరిచిందని తెలిపారు. మృతుని కుటుంబానికి అండగా ఉండేలా పోలీసు సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్శులు కలిసి ఈ ఆర్థిక సహాయం అందించామన్నారు.

రూ.50 వేల సాయం అందిస్తున్న సిఐ శ్రీనివాసులు

నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలి

- సిఐ మంజునాథ్

ప్రజాశక్తి - ఆదోని

దుకాణాల ముందు 'నో పార్కింగ్' బోర్డులతో పాటు వాచ్‌మేన్లను ఏర్పాటు చేసుకోవాలని సిఐ మంజునాథ్ తెలిపారు. ఆదోని డీఎస్పీ శివ నారాయణ స్వామి ఆదేశాల మేరకు మంగళవారం ఆదోనిలోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడారు. భీమాస్ సర్కిల్ నుంచి ఓల్డ్ బ్రిడ్జి వరకు ఉన్న దుకాణాలకు వచ్చే కస్టమర్స్ వాహనాలను రోడ్డు మీద పార్కు చేయించడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని తెలిపారు. వాహనాలు రాంగ్ పార్కింగ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీసులు ఉన్నారు.

దుకాణదారులతో సమావేశం నిర్వహిస్తున్న సిఐ

విద్యతోనే మెరుగైన జీవితం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆదోని

చదువుకుంటేనే జీవితంలో రాణిస్తూ సమాజంలో గౌరవం పెరుగుతుందని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని లేబర్ కాలనీ మున్సిపల్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రభుత్వం తరపున ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీ చేపట్టారు. డిప్యూటీ డిఇఒ వెంకట రమణారెడ్డి, ఎంఇఒలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు, జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప హాజరయ్యారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య వసతులు లేవన్న భావన తల్లిదండ్రుల మదిలో నుంచి తీసివేయాలని కోరారు. ప్రస్తుతం పెరుగుతున్న స్కూల్ ఫీజులను చెల్లించుకోలేక పేద తల్లిదండ్రులు బిడ్డలను చదువుకు దూరం చేసే ప్రమాదం ఉందన్నారు. ఎవరూ అధైర్యం పడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, బట్టలు, బూట్లు అందించడమే కాకుండా ఉచిత భోజన సదుపాయం కూడా ఉందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. విద్యార్థి దశలోనే భవిష్యత్తు ప్రణాళికను సిద్ధం చేసుకుని క్రమశిక్షణతో చదివితే సాధించలేనిది ఏదీ లేదని తెలిపారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన హరికృష్ణకు, మరో ఇద్దరు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఇఒ శ్రీనివాసులు మాట్లాడుతూ... ఆదోని నియోజకవర్గంలో 260 ప్రభుత్వ పాఠశాలలు, 28 ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. గతేడాది 15 వేల మంది పదో తరగతి పరీక్షలు రాశారని వివరించారు. డివిజన్ కేంద్రమైన ఆదోనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

ప్రధానోపాధ్యాయునికి సన్మానం

2015 నుంచి హైస్కూల్ అభివృద్ధి కోసం ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు చేసిన కృషి అభినందనీయమని ఎమ్మెల్యే పార్థసారథి కొనియాడారు. ప్రధానోపాధ్యాయులు రమేష్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. 190 మంది విద్యార్థుల నుంచి ప్రస్తుతం 900 మందికి పెంచడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. అంతమంది విద్యార్థులకు గాను కేవలం నలుగురు ఉపాధ్యాయులు పాఠాలు బోధించి గతేడాది పదో తరగతి పరీక్షల్లో 500కు పైగా 12 మంది మార్కులు సాధించడం గొప్ప విషయమని చెప్పారు. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా ఉపాధ్యాయులు లేని చోట ఎలా సర్దుబాటు చేయాలో ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మెరుగైన సదుపాయాల కల్పనకు అవసరమైతే పట్టణంలోని ధనవంతుల సహకారం తీసుకుందామన్నారు. హైస్కూల్‌లో చదివి ఇంటర్మీడియట్‌లో 960 మార్కులు సాధించిన ధనలక్ష్మి అనే పేద విద్యార్థికి తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు. విద్యార్థిని సన్మానించారు. పేరెంట్స్ కమిటీ నాయకులు కుశల రాజు, కలుబావి రాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎడ్యుకేషన్ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

రమేష్ నాయుడును సన్మానిస్తున్న ఎమ్మెల్యే

నేడు కేంద్ర కరువు బృందం రాక

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు నియోజకవర్గంలో కేంద్రానికి బుధవారం కేంద్ర కరువు బృందం వస్తోందని ఎడిఎ సునీత, ఎఒ వెంకటేష్ గౌడ్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడారు. 2023-24 ఏడాది రబీ సీజన్‌లో రైతులు వేసిన పంటలకు సరైన సమయంలో వర్షాలు కురవకపోవడంతో తీవ్రంగా నష్టపోయిన రైతుల పంట పొలాలను పరిశీలిస్తారని తెలిపారు. ఆలూరులోని హత్తిబెళగల్ రోడ్డులో ఉన్న ఆర్‌బికె-4లో సాయంత్రం 4 గంటలకు రైతులతో ముఖాముఖి సమావేశం ఉంటుందని చెప్పారు.

ఉపాధ్యాయులను నియమించాలి

- విద్యా కమిటీ వైస్ ఛైర్మన్ జ్యోతి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని ఆర్‌ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని విద్యా కమిటీ వైస్ ఛైర్మన్ జ్యోతి కోరారు. మంగళవారం విద్యార్థులకు పుస్తకాల పంపిణీలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథికి వినతిపత్రం అందజేశారు. జ్యోతి మాట్లాడుతూ... 850 మంది విద్యార్థులకు నలుగురు మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ఫేజ్-2 కింద 20 అదనపు తరగతి గదుల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. 250 అడ్మిషన్లు వచ్చే అవకాశముందని చెప్పారు. పదో తరగతికి కేవలం ముగ్గురు ఉపాధ్యాయులతో విద్యా ఎలా కొనసాగించాలనేది ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు స్పందించి అదనంగా 16 మంది ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు.

మీ ఇంటి ముంగిటకు 'అమెజాన్ ఫ్రెష్'

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

పండ్లు, కూరగాయలు, చిల్డ్ ఉత్పత్తులు, సౌందర్యం, బేబీ, పర్సనల్ కేర్, పెట్ ఉత్పత్తులు, ఇతర నిత్యావసరాలు వంటి తడి, పొడి కిరాణ సరుకుల ఫుల్-బాస్కెట్ కిరాణ సరుకుల సర్వీస్ అమెజాన్ ఫ్రెష్ 130 నగరాలకు విస్తరించినట్లు అమెజాన్ డైరెక్టర్లు శ్రీకాంత్, శ్రీరామ్ పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడారు. అమెజాన్ ఇండియా, అమెజాన్ ఫ్రెష్ సెల్లర్స్ పండ్లు, కూరగాయలను 11 వేలకు పైగా రైతుల నుంచి సేకరిస్తామని తెలిపారు. '4-స్టెప్ నాణ్యతా తనిఖీ' ద్వారా ఉత్పత్తి నాణ్యతను నిర్ధారిస్తామని చెప్పారు. అంబాలా, ఔరంగాబాద్, హోషియార్ పూర్, ధార్వాడ్, ఉనా, సూరి వంటి 130 నగరాల్లో అమెజాన్ ఫ్రెష్ సెల్లర్స్, బ్యాంకు భాగస్వాముల నుంచి ఉత్తేజభరితమైన డీల్స్ పొందుతారని తెలిపారు. 'అమెజాన్ ఫ్రెష్' భారతదేశంలో కిరాణ షాపింగ్ రూపుదిద్దుతోందని, భారతదేశంలో 130 పట్టణాల్లో తమ కస్టమర్స్ ఇంటి ముంగిటకు తాము తాజా ఉత్పత్తి, నిత్యావసరాలు తెస్తామని చెప్పారు. నిత్యావసరాల కోసం ఉత్తమమైన ఆన్ లైన్ షాపింగ్ అనుభవాన్ని అందిస్తామన్నారు. కస్టమర్స్ క్యాష్ బ్యాక్ ఆఫర్స్, బ్యాంక్ డిస్కౌంట్స్ నుంచి ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. తమ ప్రతి కొనుగోలుకు విలువను చేకూరుస్తుందని వెల్లడించారు.

ధర్నా చేపడుతున్న నాయకులు

90శాతం సబ్సిడీతో విత్తనాలివ్వాలి: సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రైతులకు ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో 90 శాతం సబ్సిడీతో విత్తనాలు ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి బి.నాగన్న, రైతుసంఘం మండల అధ్యక్షులు బి.చంద్రబాబు నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం ఓర్వకల్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రైతు సంఘం మండల నాయకులు ఎస్.మధుసూదన్ అధ్యక్షత వహించారు. బి.నాగన్న, బి.చంద్రబాబు నాయుడు మాట్లాడారు. రెండు, మూడేళ్లుగా సక్రమంగా వర్షాలు కురవక, పంటలు దిగుబడి రాక రైతులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. నకిలీ విత్తనాలతో తీవ్రంగా నష్టపోయారన్నారు. గత సంవత్సరం అతి తక్కువ వర్షపాతం నమోదు కావడంతో పంటలన్నీ కూడా ఎండిపోయాయన్నారు. ప్రభుత్వం కరువు మండలంగా గుర్తించి సహాయక చర్యలు లో భాగంగా ఇన్పుట్ సబ్సిడీ రైతులకు పూర్తిస్థాయిలో ఇవ్వలేదన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఈ ప్రాంతంలో పండించే పంటలు మొక్కజొన్న, ఉల్లి,పత్తి, మిరప, కందులు వేరుశనగ, ఆముదాలు, కొర్రలు వివిధ రకాల విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేయాలన్నారు. ఎరువులు 90శాతం సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వేరుశనగ విత్తనం మాత్రమే ఇస్తామని ఇప్పటికే ప్రకటించిందన్నారు. రైతులందరికీ సరిపడే విత్తనాలు 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టాలని, ఎరువులు, పురుగు మందులు సరసమైన ధరలకు రైతు భరోసా కేంద్రాల్లో అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సూర్యనారాయణ చాంద్‌బాషా, నాగరాజు, మల్లేష్, మాసుంబాష, జగన్నాథం, ఎల్ల రాజు, రామాంజనేయులు రైతులు పాల్గొన్నారు.

వంట ఏజెన్సీ విషయంలో

టిడిపి నాయకుల తగాదా

- బిల్లులు చెల్లించకుండా ఏజెన్సీ రద్దు చేయడం అన్యాయం అంటున్న హంపమ్మ

ప్రజాశక్తి - మంత్రాలయం

తగాదాకు దిగిన నాయకులు

మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీ విషయంలో నాయకుల మధ్య తగాదా నెలకొంది. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రాఘవేంద్ర రెడ్డి గ్రూపు, టిడిపి నాయకులు పాటిల్ అశోక్ రెడ్డి, వరదరాజులు తమ మద్దతు దారులతో వెళ్లారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు హంపయ్యతో తమకు వంట ఏజెన్సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పందించిన ప్రధానోపాధ్యాయులు పైనుంచి ఆదేశాలు రాగానే ఇచ్చేస్తామని చెప్పారు. అనంతరం స్థానిక సంత మార్కెట్‌లో ఉన్న ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు వెళ్లారు. అక్కడ వంట ఏజెన్సీ నిర్వాహకులు వైసిపి గ్రూపునకు చెందిన వనికె హంపమ్మ సుమారు 70 మంది విద్యార్థులకు వంట చేస్తున్నారు. ఆమెను వంట వండడం నిలిపివేయాలని కోరారు. ఆమె వండిన అన్నాన్ని వదలి పక్కకు రాగా ఖాసీం అనే వ్యక్తికి ఇచ్చేందుకు అశోక్ రెడ్డి, వరదరాజులు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న తిక్కారెడ్డి గ్రూపు, టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి అనుచరులు విజయరామిరెడ్డి, గనేకంటి రామకృష్ణ, వట్టెప్ప గారి నరసింహ తదితరులు గతంలో తామే వంట ఏజెన్సీ చేసేవారమని, తమకే కావాలని కోరారు. టిడిపి మండల అధ్యక్షునికి చెప్పకుండా నేరుగా రావడం ఏమిటని ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. మాధవరం నుంచి ఫోన్‌ల ద్వారా బెదిరింపులకు పాల్పడుతున్నారని టిడిపి నాయకులు విజయరామిరెడ్డి, హండె హనుమంతు ఎస్ఐ గోపినాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన టిడిపి యువ నాయకులు ఎన్.రామకృష్ణారెడ్డితో మాట్లాడి ఇది మంచి పద్ధతి కాదని తెలిపారు. వంట ఏజెన్సీని ఇరు గ్రూపులకు, వైసిపి గ్రూపునకు ఇవ్వకుండా ఆర్డర్ వచ్చేంత వరకు మరో వ్యక్తికి అప్పగిస్తామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్య లత పేర్కొన్నారు. ఇంత వరకు వంట ఏజెన్సీ నిర్వహించిన బిల్లులు మంజూరు చేయకుండా తమ ఏజెన్సీని రద్దు చేయాలనుకోవడం అన్యాయమని వనికె హంపమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమ బిల్లులు చెల్లించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఎస్ఐ గోపినాథ్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

హంపమ్మ

కురువలకు సముచిత స్థానం కల్పించాలి

- కురువ సంఘం నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

కర్నూలు జిల్లాలో ఉన్న కురువులకు టిడిపి సముచిత స్థానం కల్పించాలని కురువ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, కౌతాళం మండల అధ్యక్షులు కురువ వీరేష్ కోరారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడరు. కురువలను నమ్మి రెండు ఎంపీ, ఒక ఎమ్మెల్యే స్థానాన్ని కేటాయించిన చంద్రబాబుకు, ముగ్గురిని గెలిపించి కానుకగా ఇచ్చామని తెలిపారు. అందుకు కురువులకు ఒక మంత్రి పదవి ఇచ్చినందుకు చంద్రబాబు నాయుడు మాట నిలబెట్టుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లాలో ఉన్న కురువులకు కురువ సంఘం జిల్లా అధ్యక్షులు మాన్వి దేవేంద్రప్పకు కెడిసిసి బ్యాంకు ఛైర్మన్ పదవి ఇవ్వాలని కోరారు. అలాగే జడ్‌పి మాజీ ఛైర్మన్ బత్తిన వెంకట రాముడుకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని తెలిపారు. వీళ్లిద్దరూ టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పోరాడుతున్నారని, పార్టీని నమ్ముకొని పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేశారని చెప్పారు. ఇలాంటి వారికి తప్పకుండా పదవి ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. కురువ సంఘం నాయకులు కురువ రమేష్, కురువ శివకుమార్, అనిమేష్, బీరప్ప, దేవేంద్ర, రమేష్, వీరలింగ, రంగస్వామి పాల్గొన్నారు.

ఎంపీ నాగరాజును సన్మానిస్తున్న నాయకులు

టిడిపిలో చేరుతున్న నాయకులు

కొనసాగుతున్న చేరికలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజవర్గంలో వైసిపి నుంచి టిడిపిలో 80 కుటుంబాలు చేరాయి. మంగళవారం పట్టణంలోని నివాసం వద్ద టిడిపి ఇన్‌ఛార్జీ, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మీనాక్షి నాయుడు సమక్షంలో మాజీ కౌన్సిలర్ తిమ్మప్ప ఆధ్వర్యంలో 60 కుటుంబాలు, అడ్వకేట్ ఐసి.రామకృష్ణ, వలీ ఆధ్వర్యంలో ఇంద్ర నగర్ నుంచి 20 కుటుంబాలు టిడిపిలో చేరాయి. మీనాక్షి నాయుడు వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

రైతుల సంక్షేమమే 'పిఎం కిసాన్' లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

రైతుల సంక్షేమమే లక్ష్యంగా తీసుకొచ్చిన 'పిఎం కిసాన్'ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పార్థసారథి కోరారు. 'పిఎం కిసాన్' నిధి విడుదలలో భాగంగా 17వ విడత ప్రారంభ కార్యక్రమాన్ని లైవ్ వెబ్ క్యాస్ట్ ద్వారా ప్రధాన మంత్రి వారణాసి నుంచి ప్రారంభించారు. మంగళవారం మండలంలోని ఆరెకల్ గ్రామంలో ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మాట్లాడారు. మండలంలో 21,774 మంది రైతులకు రూ.4,35,48,000 నేరుగా రైతు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. అనంతరం రైతులతో ముఖాముఖి మాట్లాడి రైతు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచి లోహిత ప్రియా, ఎఒ అశోక్ కుమార్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు ఆరెకల్ రామకృష్ణ, గ్రామ వ్యవసాయ సహాయకులు అయ్యన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను సర్పంచి పూజారి హైమావతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి మంచి పేరు తెచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, అడ్వకేట్ చంద్రశేఖర్, స్కూల్ కమిటీ ఛైర్మన్ ఉస్మాన్, అడ్వకేట్ వెంకటేశ్వర్లు, హోటల్ రహమతుల్లా, మదీనా, ఎన్‌వి.బాబు నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచి పూజారి హైమావతి

సమగ్ర శిక్ష ఉద్యోగులకు డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వాలి

- సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి - గోనెగండ్ల

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న 2024 డీఎస్సీలో ఎపి సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు వెయిటేజీ ఇవ్వాలని ఆ సంఘం జిల్లా నాయకులు కె.పుల్లన్న కోరారు. మంగళవారం గోనెగండ్లలోని మండల విద్యా వనరుల కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారులు రామాంజనేయులు, నీలకంఠకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25 వేల మంది మండల, క్లస్టర్ పాఠశాల స్థాయిలలో గత 18 ఏళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగులుగా చేస్తున్నామని తెలిపారు. మిగతా డీఎస్సీ అభ్యర్థులతో పాటు అర్హతలు కలిగిన తమకు త్వరలో నిర్వహించనున్న 2024 డీఎస్సీలో వెయిటేజీ కల్పిస్తే ఊరట లభించి తమకు మేలు జరుగుతుందని చెప్పారు. రానున్న డీఎస్సీలో తమకు తప్పకుండా వెయిటేజీ ఇచ్చి ఆదుకోవాలని కోరారు. రవికుమార్, గోవిందరాజులు, శ్రీనివాసులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

వినతిపత్రం సమర్పిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

పంచాయితీ రాజ్ శాఖ-బిట్ టెండర్ ప్రకటన

నెంబర్. 01/ఏ.ఈ/2024-25 తేది : 19-06-2024

డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, విజిలెన్స్ మరియు క్వాలిటీ కంట్రోల్ (పి. ఆర్) సబ్ డివిజన్, కర్నూల్ 1 & 2 మరియు నంద్యాల సబ్- డివిజన్ పరిధిలో జరిగిన పనులను పర్యవేక్షించుటకు గాను అర్హత కలిగిన వాహనము ఏ.సి (మహీంద్రా కాంపేర్, టావెరా, బోలెరో, సుమో గోల్డ్, టాటా) యజమాని నుండి టెండరు ఆహ్వానించటమైనది.

GO.Ms.No.87, తేది : 01-06-2027 Finance (HR-VI-TFRVA)Department of A.P. లో పేర్కొన్న నిబంధనల ప్రకారం టెండరు జరుపబడును. ఆసక్తి కల్గిన వారి నుండి సీల్డ్ వేసిన టెండర్లు ఆహ్వానించబడుచున్నవి.

టెండరు షెడ్యూల్ కొరకు ధరఖాస్తులు స్వీకరించు తేది	: 20-06-2024 సా॥ 5-00 గంటలవరకు
టెండరు షెడ్యూల్ జారీ చేయు తేదీ	: 22-06-2024 సా॥ 5-00 గంటల వరకు
టెండరు షెడ్యూల్ స్వీకరించు తేది	: 25-06-2024 సా॥ 3-00 గంటల వరకు
టెండర్లు తెరచు తేది	: 25-06-2024 సా॥ 5-00 గంటలకు

ఇతర వివరములకు కార్యాలయపు పని వేలలందు తెలుసుకొనగలరు.

సం//-

ఉప కార్య నిర్వాహక ఇంజినీర్

విజిలెన్స్ మరియు క్వాలిటీ కంట్రోల్ (పి.ఆర్)

సబ్ డివిజన్. కర్నూల్ 1 & మరియు నంద్యాల